నవతెలంగాణ
నమ్మదగ్గ తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
సోమవారం | సెప్టెంబర్ 23, 2024 | www.navatelangana.com



## పశువైద్యాధికారులకు సన్మానం

నవతెలంగాణ-తాంసి



భీంపూర్ మండల పశువైద్యాధికారిగా గత కొన్నేండ్లుగా సేవలందించిన పశువైద్యాధికారి సుభాష్ రాథోడ్‌తో పాటు జూనియర్ వెటర్నరీ అధికారి రమణయ్య బదిలీపై వెళుతున్న సందర్భంగా ఆదివారం భీంపూర్ మండల గోపాలమిత్ర సభ్యులు ఇరువురిని పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. వారు గత కొన్నేండ్లుగా మండలంలోని అన్ని గ్రామాల్లో పశు పోషకుల పశువులకు చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమే అయినప్పటికీ వారు విధులు నిర్వహించిన ప్రదేశాలలో చేసిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని అన్నారు. గోపాలమిత్ర సభ్యులు మల్లికార్జున్, నవీన్, అజయ్, సంతోష్, గజానంద్, శ్రీకాంత్ ఉన్నారు.

## వినాయక నిమజ్జనంలో అపశృతి

నవతెలంగాణ-బజార్‌హత్నూర్



మండలంలోని పిప్రి గ్రామసమీపంలో క్రషర్ క్వారీ నీటి కుంటలో వినాయకున్ని నిమజ్జనం చేస్తుండగా వర్తమన్నూర్ గ్రామానికి చెందిన ఆరెల్లి రాకేశ్(22) మృతి చెందాడు. స్థానిక ఎస్సై అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం... వర్తమన్నూర్ గ్రామానికి చెందిన ఆరెల్లి రాకేష్ అనే యువకుడు వినాయక నిమజ్జనం కోసం క్వారీ గుంతలో నిమజ్జనం చేస్తుండగా గల్లంతవ్వడంతో గజయితగాళ్ల సాయంతో మృతదేహాన్ని వెలికి తీసినట్టు ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

## నేటి సమాజానికి ఆదర్శం ఈ యువ రైతు

- జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మండలంలోని లోకారికి చెందిన యువరైతు గెడం ప్రభాకర్ నేటి సమాజానికి ఆదర్శమని జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన రైతు రుణమాఫి పథకంలో భాగంగా వచ్చినా రూ.ఒక లక్ష నుంచి ఇటీవల తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన భారీ వర్షాలకు నష్టపోయిన వారికి తనవంతు సాయంగా రూ.10వేలను విరాళంగా ఇవ్వడం జరిగిందన్నారు. అకాల వర్షాలకు రాష్ట్ర ప్రజలు సర్వస్వం కోల్పోయారని అన్నారు. వారిని చూసి మనసుకు బాధ కలిగిందన్నారు. విపత్తుల వలన నష్టం జరిగితే ఒకరికి ఒకరు సహాయ సహకారాలు అందించుకోవాలని, అప్పుడే అందరం మనోధైర్యం కోల్పోకుండా ఉంటామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా యువ రైతు గెడం ప్రభాకర్ ప్రభుత్వం త్వరలో చేపట్టే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పథకం కార్యక్రమాన్ని లోకారి నుంచే ప్రారంభించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, కలెక్టర్ రాజర్షిషా యువరైతును అభినందించారు. ఈ కార్యక్రమంలో పెందూర్ విశ్వనాథ్, గెడం నవీన్ మడావి శుక్మత్ పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆదిలాబాద్ పాత్ర



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఆదిలాబాద్ తన వంతు పాత్రను పోషిస్తూ, రిలే నిరాహర దీక్షలను కొనసాగించి, ఆకాంక్షను వెలబుచ్చిందని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండ రామ్ అన్నారు. ఆదివారం ప్రజాసేవ భవన్‌లో కాంగ్రెస్ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. దీనికి ఎమ్మెల్సీలు అమెర్ ఆలీ ఖాన్, ప్రొఫెసర్ కోదండ రామ్ ముఖ్య అథితులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు ఎమ్మెల్సీలను సత్కరించి స్వాగతించారు. కాగా విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు లక్ష్మారెడ్డి సంఘం నాయకులు ఎమ్మెల్సీని సన్మానించారు. స్వరాష్ట్రం కోసం ఉద్యమం ఉవ్వెత్తు కొనసాగుతున్న తరుణంలో తమ ఆకాంక్షను తెలియజేస్తూ ఆదిలాబాద్ కూడా రాష్ట్రం సిద్ధించే వరకు దీక్షలు కొనసాగించిందని అన్నారు. తెలంగాణ సాధించిన తరువాత బీఆర్ఎస్ ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలను పట్టించుకోలేదన్నారు. పదేండ్ల పాటు కుటుంబ పాలనే సాగిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో మార్పు కనిపిస్తుందని, పరిశ్రమలు రావాల్సిన అవసరం ఉందని, ఉపాధి అవకాశాలు పెరగాలన్నారు. ఆ దిశగా సీఎం రేవంత్‌రెడ్డి ముందుకు సాగుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరకపోయిన రాహుల్ గాంధీ సిద్ధాంతలను నమ్ముతానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీబీ చైర్మెన్ అడ్డిబోజారెడ్డి, జైనథ్, బేల మార్కెట్ కమిటీ చైర్మెన్లు అల్లూరి అశోక్‌రెడ్డి, వైస్ చైర్మెన్ విలాస్, కౌన్సిలర్లు జహీర్ రంజానీ, బండారి సతీష్, నాయకులు లోక ప్రవీణ్‌రెడ్డి, గిమ్మ సంతోష్, ఎంఎ షకీల్, మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు మంచికట్ల ఆశమ్మ, శ్రీలేఖ పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు అభినందనీయం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వినాయక చవితికి మట్టి వినాయకుడిని పూజించాలని హిందూ సమాజ్ ఉత్సవ సమితి పిలుపునిచ్చి ప్రోత్సహించడం అభినందనీయమని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి నూతుల రవీందర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని సరస్వతీ శిశు మందిర్‌లో హిందూ సమాజ్ ఉత్సవ సమితి సభ్యులైన హనుమాండ్లు, ఉదయ్, రమేష్, సాగర్, వెంకటేష్, నర్సింగులను జనవిజ్ఞాన వేదిక పర్యావరణ కమిటీ విభాగం తరపున అభినందించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని, పర్యావరణ పరిరక్షణ కోసం గత 36 సంవత్సరాలుగా జనవిజ్ఞాన వేదిక కృషి చేస్తుందని అన్నారు. ప్రతి వినాయక చవితి సందర్భంగా జనవిజ్ఞాన వేదిక మట్టి విగ్రహాలను మాత్రమే పూజించాలని ప్రజలకు అవగాహన కల్పిస్తూ వస్తుందన్నారు. ఈ సంవత్సరం హిందూ జాగరణ ఉత్సవ సమితి ముందుకు రావడం అభినందనీయమని అందుకు జనవిజ్ఞాన వేదిక తరపున వారిని సన్మానించడం జరుగుతుందని తెలియజేశారు. శాస్త్రీయ ఆలోచనలను పెంపొందించడంతో పాటు, పర్యావరణ పరిరక్షణ కోసం కూడా కృషి చేస్తుందన్నారు. పర్యావరణ పరిరక్షణకు కృషి చేసిన ప్రతి ఒక్కరిని అభినందించడం, సన్మానించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరితో కలిసి వేదిక పర్యావరణ పరిరక్షణ కోసం కలిసి నడుస్తుందని తెలియజేశారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు దండ నాయక ఉమాకాంత్, ప్రధాన కార్యదర్శి పెంటపర్తి ఊశన్న, పర్యావరణశాఖ కన్వీనర్ రామగిరి శివకుమార్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, గంగన్న, శ్రీధర్ బాబు, విఠల్, సంజీవరెడ్డి, లింగన్న పాల్గొన్నారు.

# జ్వరాల పంజా..!

- జిల్లాలో కలకలం రేపుతున్న డెంగ్యూ కేసులు
- గత రెండేండ్ల కంటే అధికంగా నమోదు
- వైరల్ ఫీవర్లలతోనూ అనేక మంది సతమతం
- అపరిశుభ్రత..కలుషిత నీటితో తీవ్ర ప్రభావం

**ఆదిలాబాద్ జిల్లాను జ్వరాలు వణికిస్తున్నాయి. ఇంట్లో ఒకరికి వస్తే.. వారం రోజుల్లో ఒకరి నుంచి మరొకరికి అందరికి సోకుతోంది. దీంతో కుటుంబమంతా జ్వరాల బారినపడుతున్నారు. వర్షాకాలం ప్రారంభంలోనే మొదలైన జ్వరాల తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. ప్రతి ఇంటిని జ్వరాలు పలకరించడంతో చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ ఆస్పత్రుల బాట పడుతున్నారు. జ్వర బాధితులతో ప్రభుత్వ, ప్రయివేటు ఆస్పత్రులు కిక్కిరిసిపోతున్నాయి. అనేక మంది నిరుపేదలు ప్రయివేటులో చికిత్సల కోసం ఆర్థికంగా చితికిపోవాల్సి వస్తోంది. అధికార యంత్రాంగం ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నా పూర్తిస్థాయిలో జ్వరాలు అదుపులోకి రావడం లేదు. మరోపక్క అపరిశుభ్ర వాతావరణం, కలుషిత నీటితో పాటు వాతావరణ మార్పులు వీటికి కారణమవుతున్నాయని అధికారులు చెబుతున్నారు.**



ఉట్నూర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఆదిలాబాద్ జిల్లాలో జ్వరాలు పంజా విసురుతున్నాయి. రోజూ వందల సంఖ్యలో వివిధ రకాల జ్వరాలు నమోదవుతున్నాయి. గ్రామాలు, పట్టణాలు అనే తేడా లేకుండా అన్నింటా జ్వరాల తీవ్రత అధికంగా కనిపిస్తోంది. ముఖ్యంగా జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో ఈ సమస్య మరింత అధికంగా ఉంది. అనేక పల్లెలు జ్వరాల తీవ్రతతో వణికిపోతున్నాయి. వైరల్ జ్వరాల వ్యాప్తి అధికంగా ఉండటంతో కుటుంబంలో ఒక్కరికి వస్తే.. కొన్ని రోజుల్లోనే అందరికీ సోకుతోంది. దీంతో కుటుంబాల్లో అందరూ జ్వరాలతో బాధపడుతున్న సందర్భాలు కనిపిస్తున్నాయి.ముఖ్యంగా వైరల్ జ్వరాల బారినపడిన అనేక మందికి ఒళ్లు, కీళ్ల నొప్పులతో బాధపడుతున్నారు. చికెన్ గున్యా లక్షణాలతో అనేక మంది ఇబ్బందులకు గురవుతున్నారు. కనీసం కూర్చున్న చోట నుంచి లేవలేని పరిస్థితి ఉండటంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. జ్వరం తగ్గుముఖం పట్టినా కనీసం వారం నుంచి పది రోజుల పాటు ఈ నొప్పులు వేధిస్తున్నాయని బాధితులు చెబుతున్నారు. వీటితో పాటు మలేరియా జ్వరాలు సైతం అక్కడక్కడ ప్రబలుతున్నాయి.

**డెంగ్యూ కలకలం..!**

జిల్లాలో వైరల్ జ్వరాల తీవ్రతకు తోడు డెంగ్యూ జ్వరాలు సైతం విజృంభించడంతో బాధితులు విలవిల్లాడుతున్నారు. అధికార యంత్రాంగం ఎన్ని చర్యలు తీసుకుంటున్నా.. ప్రజలకు అవగాహన కల్పిస్తున్నా ఈ జ్వరాల నివారణ మాత్రం సాధ్యం కావడం లేదు. ఆదిలాబాద్ జిల్లాలో గత రెండేండ్ల నుంచి పరిశీలిస్తే.. ఈ ఏడాది అధికంగా నమోదు కావడం గమనార్హం. 2022 ఏడాదిలో జిల్లావ్యాప్తంగా 207 డెంగ్యూ కేసులు నమోదు కాగా.. 2023లో కేవలం 108కి మాత్రమే పరిమితమయ్యాయి. కానీ 2024లో మాత్రం వీటి సంఖ్య 276కి చేరడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. అనేక మంది ప్లేట్‌లెట్ల సంఖ్య తగ్గిపోతుండటంతో బాధితులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ జ్వరం బారి నుంచి బయటపడటానికి వారం రోజుల పాటు ప్రభుత్వ, ప్రయివేటు ఆస్పత్రుల్లో చికిత్సలు తీసుకుంటున్నారు. జ్వర బాధితుల సంఖ్య అధికం కావడంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో పడకలు లభించని పరిస్థితి కనిపిస్తోంది.దీంతో గత్యంతరం లేక అనేక మంది నిరుపేదలు సైతం మెరుగైన చికిత్స కోసం ప్రయివేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నట్లు తెలుస్తోంది. చికిత్సలకు రూ.వేలల్లో ఖర్చు చేస్తూ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

**డా.బిందుప్రియ, వైద్యురాలు, ఉట్నూర్ జిల్లా ఆస్పత్రి**



జ్వరాలు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలి. తాగునీటికి వేడి చేసుకొని తాగాలి. ముఖ్యంగా ఇంటి ఆవరణలో ఎక్కడా నిల్వ నీరు ఉండకుండా చూసుకోవాలి. లేదంటే దోమలు వృద్ధి చెందే అవకాశం ఉంటుంది. ఇంట్లో దోమ తెరలను వినియోగించుకోవాలి. తగినంత జాగ్రత్తలు తీసుకుంటేనే జ్వరాలు దరి చేరకుండా ఉంటాయి.



ఆదిలాబాద్ జిల్లాలో ఉట్నూర్ జిల్లా ఆసుపత్రిలో 46బెడ్ల సామర్థ్యం ఉండగా.. రోజూ 200మంది వరకు రోగులు జ్వరాలతో బాధపడుతూ వస్తున్నారు. ఇందులో సుమారు 60 నుంచి 70మంది వరకు ఆస్పత్రిలో అడ్మిట్ అయి చికిత్సలు తీసుకుంటున్నారు. దీంతో ఒక్కో బెడ్‌పై ఇద్దరేసి రోగులను ఉంచి చికిత్స అందించాల్సి వస్తోంది.



రిమ్స్ ఆస్పత్రిలో 500పడకల సామర్థ్యం ఉండగా.. ప్రస్తుతం వివిధ రకాల జ్వరాలు, వ్యాధులతో 866మంది అడ్మిట్ అయి చికిత్సలు తీసుకుంటున్నారు. దీంతో ఒక్కో బెడ్‌పై ఇద్దరేసి రోగులను ఉంచి చికిత్సలు అందించాల్సి వస్తోంది. దీనికి తోడు రోజూ 2200మంది రోగులు బయటి రోగుల విభాగం(ఓపీ)లో చికిత్సలు తీసుకుంటున్నారు. సూపర్ స్పెషాలిటీకి మరో 600మంది వరకు రోగులు వచ్చి చికిత్సలు తీసుకుంటున్నారని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో జ్వరాల తీవ్రత ఎంత ఉందో ఈ పరిస్థితి చూస్తే తెలుస్తోంది.

# ప్రభుత్వాలు మారిన మారని తీరు

- కాగితాలకే పరిమితమవుతున్న నిధుల విడుదల
- పనులు చేసి అప్పుల పాలవుతున్న కిందిస్థాయి నాయకులు
- అభివృద్ధి పనులు చేయడానికి భయపడుతున్న కాంట్రాక్టర్లు

నవతెలంగాణ-భైంసా

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనులు కాగితాలకే పరిమితమైతే, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక తీరు మారి అభివృద్ధి పనులు జరుగతాయనుకుంటే 9 నెలల పాలనలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న విధంగా ఉంది అన్న పరిస్థితి నెలకొందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఒకప్పుడు ప్రజా ప్రతినిధులు, నిధులు విడుదల అయ్యాయని తెలిపితే గ్రామాల్లో చక చక పనులు సాగేవి. ఇప్పుడు పరిస్థితి భిన్నంగా మారింది. ప్రభుత్వం రూ.కోట్ల నిధులకు ప్రొసీడింగ్‌లు ఇస్తున్న, ప్రస్తుతం ప్రభుత్వ తీరును చూస్తే అవన్నీ ఉత్తుత్తివే అనిపిస్తుంది. గతంలో గ్రామాల్లో సర్పంచ్‌లు అభివృద్ధి పనులు చేస్తే వారికి బిల్లులు రాక అప్పుల పాలయ్యారు. సర్పంచ్‌ల పదవి కాలం ముగిశాక ఇప్పటి ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు కనీస నిధులు ఇవ్వక పోవడం తో ప్రభుత్వ ఉద్యోగులైనా గ్రామపంచాయతీ కార్యదర్శులు అప్పులు తెచ్చి కనీస సౌకర్యాలు కల్పించాల్సిన పరిస్థితి వచ్చిదంటే పాలన ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుంది. గత మార్చి నెలలో ఉపాధి హామీ చట్టం కింద ప్రతి మండలానికి కోటి నుంచి రెండు కోట్ల రూపాయలు నిధులు మంజూరయ్యాయి. కొత్త ప్రభుత్వం రాగానే ఉత్సహంతో ఉన్న కార్యకర్తలు అధికార పార్టీ వాళ్లు, ఇక్కడ ఎమ్మెల్యే ప్రతి పక్షం ఉండటంతో బీజేపీ వాళ్ల పోటా పోటీగా సీసీ రోడ్లు వేసేశారు. అప్పులు తెచ్చి పనులు చేస్తే ఏడు నెలలు గడిచిన పని చేసిన వారికి ఇప్పటికి బిల్లులు రాలేదు. దీంతో ప్రస్తుతం పనులు చేస్తే నిండుగా మునగాల్సి వస్తుందని గ్రామీణ నాయకులు భయపడుతున్నారు. ఇక జిల్లా ఇన్‌చార్జి మంత్రి స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ పేరిట నిధులివ్వడంతో నియోజకవర్గంలో తాము నిధులు తెస్తున్నామని పత్రికలకు ప్రకటన ఇస్తున్నప్పటికి ప్రభుత్వ తీరును చూసి ఎవ్వరు నమ్మలేక పోతున్నారు. చేసిన పనులకు బిల్లులు ఇవ్వక పోవడంతో కొత్త పనులు చేయడానికి ముందుకు రావాలంటేనే భయపడుతున్నారు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం అప్పటి సర్కార్ తీరును అవలంభిస్తుండటంతో అభివృద్ధి ముందుకు సాగడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# పార్టీపై నమ్మకంతో కాంగ్రెస్‌లో చేరేందుకు ఆసక్తి

- ఎమ్మెల్సీ అమెర్ అలీ ఖాన్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంగ్రెస్‌పై నమ్మకంతో ఎంతో మంది పార్టీలో చేరేందుకు ముందుకు వస్తున్నారని, ఎమ్మెల్సీ అమెర్ అలీ ఖాన్ అన్నారు. ఈ ఉత్సహంతో భవిష్యత్తులో రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం పట్టణంలోని ప్రజాసేవ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియోజకవర్గంలోని లేకర్‌వాడ, బంగారుగూడ, యాపల్‌గూడ, యశ్వంత్‌గూడ, జముల్‌ధరికి చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్సీ వారికి పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పలువురు పార్టీ నాయకులు ఎమ్మెల్సీని శాలువాతో సత్కరించారు. ఎలాంటి రాజకీయ నేపథ్యం లేకుండా కార్పొరేట్ సెక్టర్ నుంచి వచ్చిన కంది శ్రీనివాస్‌రెడ్డి ఆదిలాబాద్ కాంగ్రెస్‌ని ముందుకు తీసుకెళ్లడం అభినందనీయమని అన్నారు. ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో పార్టీ గతంలో ఎన్నడూ లేని విధంగా బలోపేతమవుతుందన్నారు. ప్రజలకు ఇచ్చిన గ్యారంటీలను పూర్తి స్థాయిలో అమలు చేస్తామన్నారు. ఎలాంటి రాజకీయ నేపథ్యం లేని ఆయన పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, జైనథ్, బేల మార్కెట్ కమిటీ చైర్మెన్‌లు అల్లూరి అశోక్‌రెడ్డి, వైస్ చైర్మెన్ విలాస్, కౌన్సిలర్లు జహీర్ రంజానీ, బండారి సతీష్, నాయకులు లోక ప్రవీణ్‌రెడ్డి, గిమ్మ సంతోష్, ఎంఎ షకీల్, మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు మంచికట్ల ఆశమ్మ, శ్రీలేఖ, రూప, జ్యోతి, ప్రేమల పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడి మృతి

నవతెలంగాణ-తలమడుగు

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి మండలంలోని మల్కాపల్లె గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మహారాష్ట్ర సార్థాని గ్రామానికి చెందిన ఏక్‌నాథ్(46) తన మిత్రుడు హనుమంతుతో కలిసి కారులో ప్రయాణిస్తుండగా మల్కాపల్లె గ్రామ సమీపంలో అదుపుతప్పి చెట్టుకు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఏక్‌నాథ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు ప్రస్తుతం మహారాష్ట్రలోని కిన్వట్ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై అంజమ్మ తెలిపారు.



## ఆర్ట్స్ కళాశాలలో ముగిసిన బోస్ ఫెలోషిప్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో బోస్ ఫెలోషిప్ భారత్ దేఖో ఐటీడీఏ ఉట్నూర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు గత నాలుగు రోజులు శిక్షణను నిర్వహించారు. కాగా శిక్షణ కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు వివిధ రకాల నైపుణ్యాలను, సమాజంతో కలిసిపోయి పనిచేయడం, సామాజిక కార్యక్రమాలను స్వచ్ఛందంగా చేయడం లాంటివి నేర్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అతిక్ బేగం అధ్యక్షత వహించి, విద్యార్థులు ఈ వర్క్‌షాప్‌లో నేర్చుకున్న ప్రతిదీ కూడా తోటి వారికి సహాయపడుతూ సమాజానికి ఎంతో సేవ చేయాలని అన్నారు. కార్యక్రమం నిర్వాహకులు బోస్ సంస్థ వ్యవస్థాపకులు అభిజిత్ మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక సేవ కలిగి ఉండాలని, చుట్టుపక్కల వారిపై సేవా భావాన్ని కలిగి ఉండాలని తెలియజేశారు. విద్యార్థులు అంజలి, ప్రవళిక నిఖిత ఈ కార్యక్రమంలో వారు నేర్చుకున్న విషయాల గురించి మాట్లాడారు. సమాజానికి సంబంధించిన వివిధ అంశాలు నేర్చుకున్నామని తెలియజేశారు. కార్యక్రమంలో సహ వ్యవస్థాపకులు రొమీల కోఆర్డినేటర్లు చంద్రకాంత్, గోపాల్, క్రునాల్ సౌజన్య, శిక్షకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జూనియర్ అథ్లెటిక్స్ విభాగంలో బంగారు పతకం



నవతెలంగాణ-ఉట్నూర్

మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన గురుకుల బాలికల డిగ్రీ కళాశాల విద్యార్థిని జూనియర్ అథ్లెటిక్స్ విభాగంలో బంగారు పతకం సాధించింది. కళాశాలలో రెండో సంవత్సరం చదువుతున్న అశ్విని ఈనెల 20న హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న విద్యార్థిని హైజంప్‌లో గోల్డ్ మెడల్ సాధించగా, కళాశాల ప్రిన్సిపల్ బాణోత్ హరిత, సిబ్బంది అభినందించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
ఆదిలాబాద్-నిర్మల్
సోమవారం | సెప్టెంబర్ 23, 2024 | www.navatelangana.com

## బుద్దిస్ట్ లా పై అవగాహన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

భారతదేశంలో ప్రతి మతంలో పర్సనల్ లా ఉన్నప్పుడు బుద్దిస్టలకు ఎందుకు ఇవ్వడం లేదని బుద్దిస్ట్ పర్సనల్ లా ప్రవక్త మనోజ్ చపని అన్నారు. ఆదివారం పట్టణంలోని కైలాష్ నగర్‌లోని అశోక బుద్ద విహార్‌లో బుద్దిస్ట్ లాపై అవగాహన కల్పించడంతో పాటు సలహాలను స్వీకరించారు. లా అవశ్యకతను తెలియజేసేల ప్రధాన మంత్రికి త్వరలోనే లేఖల ఉద్యమాన్ని చేపట్టనున్నారు. ఇందులో భాగంగానే ఆయా పట్టణాల్లో సమావేశాలను నిర్వహిస్తున్నారు. ఎన్నో ఏండ్లుగా బుద్దిస్ట్ పర్సనల్ లా కోసం ఉద్యమిస్తున్న పట్టించుకోవడం లేదని మనోజ్ చపని అన్నారు. సమావేశాల సందర్భంగా ప్రజాప్రతినిధులు హామీలిస్తు విస్మరిస్తున్నారన్నారు. అన్ని మతలకు లా ఉన్నపుపడు బుద్దిస్టులకు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. లా చేయాలనే ప్రధాన మంత్రికి లేఖల ఉద్యమాన్ని చేపట్టామన్నారు. త్వరలోనే ఆ లేఖల కాపీలను పంపిస్తామని వాటిని పూరించి పీఎంకు పోస్టు చేయాలన్నారు. బుద్దిస్ట్ పర్సనల్ లా సాధించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆర్యసంఘ మిత్ర, మధుబవల్కర్, గణేష్ మేకానే, తుకారం, దయానంద్, ఉత్తం, రవి జాబాడే ఉన్నారు.

## అక్టోబర్ 7న జంగు బాయి దీపారాధన

నవతెలంగాణ-నార్నూర్



ఆదివాసుల ఆరాధ్యదైవం కోట పరందొలిలో కొలువుదీరిన రాయితాడ్ జంగుబాయి దీపారాధన కార్యక్రమాన్ని అక్టోబర్ 7న నిర్వహిస్తున్నట్టు తుమ్రం మాన్కు పటేల్ పేర్కొన్నారు. ఆదివారం గుండల గ్రామంలో దసరా ఉత్సవాలకు సంబంధించిన 8 గోత్రాల అన్నదమ్ముల సమక్షంలో సమావేశం నిర్వహించారు. నెల రోజుల పాటు జరిగే దీపారాధన కార్యక్రమానికి వివిధ ప్రదేశాలు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులు వస్తారన్నారు. వారికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో తుంరం సంతోష్, సలాం శ్యాంరావ్, మరప బాదిరావ్, కోడప జాకూ, తుమ్రం జుగాదిరావ్, రామారావ్ ఉన్నారు.

# ఉద్యమాల్లో గద్దర్ పాటలు కీలకం

- ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండ రాం
- ప్రజాకవి సంస్మరణ సభ





నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంతో పాటు బడుగు బలహీన వర్గాల పోరాటల్లో ప్రజ కవి, యుద్ద నౌక గద్దర్ పాడిన పాటలు ప్రజలను చైతన్యవంతులను చేశాయని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండ రాం అన్నారు. ఆదివారం ఎస్టీయూ భవన్‌లో యుద్ధనౌక, ప్రజాకవి గద్దర్, సియసత్ ఎడిటర్ జహీరోద్దిన్ ఆలీ ఖాన్ సంస్మరణ సభను నిర్వహించారు. దీనికి గద్దర్ కుమార్తె వెన్నెల, జహీరోద్దిన్ కుమారుడు ఫఖర్ అలీ ఖాన్‌తో కలిసి ఆయన ముఖ్యఅథితిగా పాల్గొన్నారు. ముందుగా వారి చిత్రపటాలకు పూలమాలలు శ్రద్ధాంజలి ఘటించి వారి ఆత్మకు శాంతి చేరుకాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. కళాకారులు పాటలు పాడుతూ గద్దర్ గురించి తెలియజేశారు. గద్దర్ కుమార్తె వెన్నెల తన ప్రసంగం అనంతరం పాటలు పాడి ఉత్సహపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వరాష్ట్రం కోసం అన్ని వర్గాలవారిని మమేకం చేయడంలో గద్దర్ పాటలు ఎంతో దోహదం చేశాయని గుర్తు చేశారు. తన కోసం కాకుండా ప్రజల కోసం పోరాటం చేసిన వ్యక్తులను సమాజం మరిచిపోదన్నారు. తెలంగాణ ఆత్మగౌరవ పోరాటంతో పాటు బడుగుబలహీన వర్గాల సమస్యలపై తన పాటల ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేశారన్నారు. తల్లి నుంచి పాటలు నేర్చుకొని అనేక ఉద్యమాల్లో కీలకంగా వ్యవహరించారని గుర్తు చేశారు. అదే విధంగా ఉద్యమానికి జహీరొద్దిన్ అలీ ఖాన్ కూడా ఎంతో సహకారం అందించారన్నారు. అలాంటి మహానీయులను గుర్తిస్తు సంస్మరణ సభ నిర్వహించడం అభినందనీయమన్నారు. అనగారిన వర్గాల అభ్యున్నతికి కోసం వారిని చైతన్యపరడానికి తన తండ్రి పాటల రచించి పాడారని వెన్నెల అన్నారు. నీడని నమ్మని సమాజంలో జహీరోద్దిన్ అలీ ఖాన్‌ను తన తండ్రి నమ్మేవారన్నారు. ఇద్దరు వేరే రంగాల్లో ఉన్న వారిని కలిపింది ప్రజ సమస్యలేనని తెలిపారు. ప్రజల కోసం పాటల ద్వార గద్దర్ ఉద్యమిస్తే నిశబ్దాంగా వెనకనుంచి పేదలను, ఉద్యమకారులను జహీరోద్దిన్ అలీ ఖాన్ సహకారం ఇచ్చే వారని తెలిపారు. మహానీయుల ఆశయాలను కొనసాగించాలంటే చదువు ఇవ్వాలన్నారు. చదువుతోనే ఏ సమాజమైన అభివృద్ధి చెందుతుందని, తల్లిదండ్రులు ఆ దిశగా ఎంత కష్టమైన ఉన్నత విద్యను అందించాలన్నారు. కార్యక్రమంలో ఓయూ జేఏసీ నాయకులు మందల భాస్కర్, దరువు ఎల్లన్న, దుర్గం భాస్కర్, డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి, టీఎన్జీఓస్ అధ్యక్షుడు అశోక్, సంస్మరణ సభ ఆహ్వాన కమిటీ సభ్యులు సొగల సుదర్శన్, అశోక్, పరమేశ్వర్, సత్యవాన్, అర్బత్ ఖాన్, ప్రశాంత్ పాల్గొన్నారు.



**కంది కార్యాలయాన్ని సందర్శించిన గద్దర్ కూతురు**

ప్రజా యుద్ధ నౌక గద్దర్, జహీరోద్దీన్ అలీ ఖాన్ సంస్మరణ సభకు విచ్చేసిన అతిథులు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండ రామ్, గద్దర్ కూతురు వెన్నెల పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయాన్ని ఆదివారం సందర్శించారు. కందితో పాటు కాంగ్రెస్ శ్రేణులు వారికి ఘన స్వాగతం పలికారు. గద్దర్ సేవలను స్మరించుకునేందుకు ఆదిలాబాద్‌కు రావడం తమ అదృష్టమన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, జైనథ్, బేలా మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్ రెడ్డి, వైస్ చైర్మన్ విలాస్ పటేల్ సవాపురే, సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్, ఎంఏ షకీల్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, లోక ప్రవీణ్ రెడ్డి, కౌన్సిలర్లు బండారి సతీష్, సంద నర్సింగ్, మాజీ జడ్పీటీసీ రాందాస్ నాక్లే, బ్లాక్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు సంజయ్ గుండవార్ నాయకులున్నారు.

## రక్త హీనతను తరిమేద్దాం

- మంత్రి సీతక్క



నవతెలంగాణ-ఉట్నూర్

బాలికలలో రక్త హీనతను తరిమేద్ధామని మంత్రి సీతక్క అన్నారు. ఆదివారం పట్టణంలోని ఆశ్రమ బాలికల పాఠశాల ఉట్నూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే బొజ్జు పటేల్‌తో పాటు పాల్గొని ఆమె మాట్లాడారు. గిరిజన బాలికలు రక్త హీనతతో చాలా బాధపడుతున్నారని, రక్త హీనతను తరిమేయాడానికి ప్రతి ఒక విద్యార్థిని పౌష్టికాహారం తీసుకోవాలని అన్నారు. అనంతరం బాలికలకు ఇప్పపువ్వు లడ్డులను పంపిణీ చేశారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో ప్రతి ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా అధికారులు పర్యవేక్షించాలన్నారు. పదో తరగతిలో మంచి ఫలితాలు వచ్చే విధంగా పాఠశాల ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రతి ఒక పాఠశాలలో మెనూ ప్రకారమే భోజనాలు పెట్టాలని, లేని యెడల చర్యలు తప్పవని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణలో ఉంటూ శ్రద్ధ పెట్టి చదువుకొని, తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులకు మంచి పేరు తేవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విఠల్, ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా, కలెక్టర్ రాజర్షిషా, సబ్ కలెక్టర్ యువరాజ్, ఎస్పీ గౌస్ అలం, డీఎస్పీ నాగేందర్, నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు మౌనిష్‌రెడ్డి పరామర్శ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జైనథ్, బేల మండల కేంద్రాల్లో సామాజిక కార్యకర్త మౌనిష్‌రెడ్డి ఆదివారం పర్యటించారు. ముందుగా జైనథ్ మండలానికి చెందిన బాధిత కుటుంబీకులు పుంద్రు యాదవరెడ్డి, ఎల్మ గంగుబాయితో పాటు బెల్గం గ్రామానికి చెందిన కుంట హన్మంత్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం బేల మండలం సిర్సన్న గ్రామానికి చెందిన యువకుడు అవినాష్ పిడుగు పాటుకు గురై మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం వారి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసి, అండగా నిలిచారు.

**అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న మౌనిష్‌రెడ్డి...**

పట్టణంలోని రిమ్స్ ఆవరణలో గత కొన్ని రోజులుగా ప్రతి రోజు ఉదయం యువ శక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అల్పాహారం పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం నిర్వహించిన అల్పాహారం పంపిణీ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త మౌనిష్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వడ్డించి అల్పాహారం పంపిణీ చేశారు. అనంతరం ఫౌండేషన్ తరపున ఆయనను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షులు రోహిత్ షిండే, కిరణ్, అంకిత్, సాయి, శ్రీకాంత్‌రెడ్డి ఉన్నారు.

## బీఆర్ఎస్‌లో పలువురి చేరిక



నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని కొరిటికల్ గ్రామానికి చెందిన తిత్రే చందర్ సింగ్ తో పాటు పలువురు నాయకులు ఆదివారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సమక్షంలో బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నివాసంలో పలువురు వివిధ పార్టీ నాయకులు బీఆర్ఎస్ కండువా కప్పి ఎమ్మెల్యే పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చందర్ సింగ్ మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధి కోసమే తెలంగాణ సాధించిన పార్టీ బీఆర్ఎస్ పార్టీలోకి చేరానని తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అడుగుజాడల్లో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ వెంటే ఉంటామని తెలిపారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ బోథ్ నియోజకవర్గ అభివృద్ధి కొరకు సహకరించాలని, ఎల్లప్పుడూ ప్రజల్లో ఉండాలని, రాబోయే ప్రభుత్వం ముమ్మాటికీ మనదేనని అన్నారు. కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ చైర్మెన్ నానక్ సింగ్, ప్రతాప్ పలువురు పాల్గొన్నారు.

## ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-సారంగాపూర్

ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి జన్మదిన సందర్బంగా మండలంలోని జామ్‌లోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఆదివారం బీజేపీ నాయలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్బంగా బీజేపీ పార్టీ మండలాధ్యక్షులు కార్పె విలాస్ మాట్లాడుతూ బీజేపీ శాసనసభ పక్షనేత నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆయురారోగ్యాలతో నిండు నూరేండ్లు జీవిస్తూ, నిర్మల్ ప్రజానీకానికి ఎల్లప్పుడూ సేవా చేయాలనీ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ వెలిశాలి తిరుమలచారి, సీనియర్ నాయకులు ఆడెపు మహేందర్, గంధం భూమేష్, రామ్, లింగారెడ్డి, నవీన్, సామ సంతోష్‌రెడ్డి, అంబాజీ, గ్రామ ప్రజలు, యువకులు పాల్గొన్నారు.

## మాధవ రావు స్ఫూర్తితో సమస్యలపై పోరాడుదాం

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్
- సుందరయ్య భవనంలో మాధవ రావ్ వర్ధంతి




నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బాశెట్టి మాధవ రావు స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడుదామని, ప్రజా సమస్యలపై పోరాటమే మాధవ రావుకు ఘనమైన నివాళి అర్పించినట్లని సీపీఐ(ఎం) జిల్లా ప్రధాన కార్యదర్శి దర్శనాల మల్లేష్ అన్నారు. ఆదివారం పట్టణంలోని సుందరయ్య భవనంలో బాశెట్టి మాధవరావు 11వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లాలో భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు పార్టీని 1978 ప్రాంతంలో ఇతరులతో కలిసి ఏర్పాటు చేసి నాటి నుండి జీవించినంత కాలం ప్రజా, కార్మిక సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహించిన వ్యక్తి బాశెట్టి మాధవరావు అన్నారు. పట్టణంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని అనేక భూ పోరాటాలను ముందుండి నడిపి అనేక కాలనీలను ఏర్పాటు చేసిన చరిత్ర వారికి ఉందని గుర్తు చేశారు. అగ్రకులంలో పుట్టిన పీడితుల పక్షాన నిలబడి సర్వసం త్యాగం చేసి ప్రజా పోరాటాలను ముందుండి నడిపారని అన్నారు. జిల్లాలో పార్టీ ప్రజాసంఘాల విస్తరణ కోసం అపర్నిశలు కృషి చేశారని తెలిపారు. బాశెట్టి మాధవరావు స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆవలంబిస్తున్న ప్రజా, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలపైన పోరాటాలను రూపొందించాలని అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లంకా రాఘవులు, అన్నమొల్ల కిరణ్, సీనియర్ నాయకులు బండి దత్తాత్రి, జిల్లా కమిటీ సభ్యులు మంజుల, ఆర్.సురేందర్ పాల్గొన్నారు.

## రిజర్వాయర్ భూనిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలి



నవతెలంగాణ-తాంసి

భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి రిజర్వాయర్ భూనిర్వాహితులకు నష్టపరిహారం వెంటనే చెల్లించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష డిమాండ్ చేశారు. ఆదివారం భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి గ్రామంలో గ్రామ రెండవ శాఖ మహాసభల కార్యక్రమంలో భాగంగా పార్టీ సీనియర్ హైమద్ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ మాట్లాడుతూ పిప్పల్‌కోటి రిజర్వాయర్ భూనిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించకుండా గత, ప్రస్తుత ప్రభుత్వాలు కాలయాపన చేయడాన్ని సీపీఐ(ఎం) తీవ్రంగా ఖండిస్తుందన్నారు. వెంటనే నిర్వాసిత రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రామంలో పక్కా ఇండ్లు రేషన్ కార్డులు, పెన్షన్లు, ఇతర అపరిష్కృతంగా ఉన్న ప్రజాసమస్యలపై పోరాటాలు చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గ్రామంలో కలిసి మెలిసి జీవించే ప్రజలను విడదీసి పబ్బం గడుపుకునే బీజేపీ పెరుగుదల ఐక్య మత్యానికి ప్రమాదకరమన్నారు. అనంతరం పార్టీ గ్రామశాఖ కార్యదర్శిగా దోనిపెల్లి స్వామిని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ ఆశన్న, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 49 వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తాం

- ఎమ్మెల్యే పాయల శంకర్
- వాల్మీకి నగర్‌లో విస్తృత పర్యటన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో ఉన్న 49 వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని వాల్మీకినగర్ కాలనీలో ఆయన పర్యటించారు. కాలనీ వాసులతో పర్యటిస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాగా కాలనీవాసులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 49 వార్డుల్లో అనేక రకమైన సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యంగా డ్రైనేజీ, రోడ్డు లేక, ప్రజలకు మంచినీటి సరఫరా లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వాల్మీకి నగర్‌లో డ్రైనేజీ నుంచి వచ్చే వాసనతో ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దశలవారీగా వార్డుల సమస్యల పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. గ్రేడ్ వన్‌గా మారిన మున్సిపాలిటీకి అనేక రకమైన సౌకర్యాలు అవసరమని తెలిపారు. ఇదివరకే ఇంజనీర్ అధికారులు ప్రాథమిక సర్వే పూర్తి చేశారని తెలిపారు. వాటి ఆధారంతో పాటు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.320 కోట్లు సరిపోవన్నారు. రాష్ట్రప్రభుత్వం తరపున మరిన్ని నిధులు ఇవ్వాలని తీసుకొచ్చేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ఇక్కడ ప్రభుత్వం లేనప్పటికీ ఏ చిన్న అవకాశం వచ్చినా నా వంతుగా పట్టణ అభివృద్ధికి నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు దయాకర్, భూమారెడ్డి, భరత్, ముకుందరావు, రాజు, గణపతి పాల్గొన్నారు.

## విద్యుద్ఘాతంతో వృద్ధుడి మృతి

నవతెలంగాణ-ఖానాపూర్

ప్రమాదవశాత్తు విద్యుద్ఘాతంతో వృద్దుడు మృతి చెందిన సంఘటన మండలంలోని పాతఎల్లాపూర్ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పాతఎల్లాపూర్ గ్రామానికి చెందిన మేకల రాజమల్లు(63) ఉదయం తన ఇంటి పక్కన పశువుల కొట్టం నుంచి బాత్‌రూమ్‌కి వెళ్తుండగా కరెంటు వైర్ మధ్యలో తెగిపోవడంతో దాన్ని చూసిన ఆయన కరెంట్ వైర్‌ను జాయింట్ చేస్తుండగా ప్రమాదశాత్తు కరెంటు షాక్ తగిలి అక్కడే కుప్పకూలిపోయాడు. వెంటనే అది గమనించిన తన భార్య స్థానికులు చికిత్స నిమిత్తం ఖానాపూర్ ప్రభుత్వాస్పత్రి తీసుకువచ్చారు. చికిత్స నిర్వహించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని కుటుంబ సభ్యులకు తెలిపాడు. మృతుని భార్య మేకల గంగవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాహుల్ తెలిపారు.

## సిరి సీడ్స్ మొక్కజొన్న రైతు ప్రదర్శన

నవతెలంగాణ-ముధోల్

మండలంలోని పిప్రి గ్రామ శివారులో రైతు పొద్దుటూరి ఆదిత్యరెడ్డి వ్యవసాయ క్షేత్రంలో ఖరీఫ్‌లో సాగుచేసిన సిరి సీడ్స్ 4527 రకం మొక్కజొన్న పంట ఆశాజనకంగా ఉండటంతో సిరిసీడ్స్ కంపెనీ ఎండీ రాకేష్‌రెడ్డి సూచన మేరకు సిరిసిడ్స్ కంపెనీ సిబ్బంది చుట్టుపక్కల రైతులతో ఆదివారం రైతు ప్రదర్శన క్షేత్రం కార్యక్రమం నిర్వహించారు. సాగుచేసిన మొక్కజొన్నను రైతులు పరిశీలించారు. మొక్కజొన్న కంకులు బాగా ఏపుగా పెరిగాయని అన్నారు. మొక్కజొన్న సాగు మెళకువలు గురించి రైతుని అడిగితెలుసుకున్నారు. దీంతో సిరిసీడ్స్ కంపెనీ యాజమాన్యం మొక్కజొన్న సాగు చేసిన రైతుకు ప్రోత్సహకంగా గిఫ్టును అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో సీరిసీడ్స్ కంపెనీ జెడ్ఎం అశోక్, ఎఎస్ఎం బి.సురేష్, సేల్స్ ఆఫీసర్ గంగాధర్, ఎండీఓ పుండలిక్ రావ్ పటేల్, రైతులు పాల్గొన్నారు.




## పసిపాపకు ఆర్థిక సాయం

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

హైడ్రోసఫాలస్ వ్యాధితో బాదపడుతున్న పట్టణంలోని ఇంద్రానగర్ కాలనీకి చెందిన రాజ్‌కుమార్ విజయలక్ష్మి దంపతుల 18 నెలల చిన్నారికి బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జీ భూక్యా జాన్సన్ నాయక్ ఆర్థిక సాయం చేశారు. సదరు చిన్నారి వ్యాధితో బాధపడుతున్న విషయం తెలుసుకున్న జాన్సన్ నాయక్ వైద్య ఖర్చుల కోసం రూ.5వేల నగదును పార్టీ కార్యకర్తల చేతుల మీదుగా అందజేశారు. చిన్నారికి మెరుగైన వైద్యం అందేలా చూస్తానాని ఆయన హామీ ఇచ్చినట్టు కార్యకర్తలు తెలిపారు. ఈ సందర్భంగా జాన్సన్‌నాయక్‌ను స్థానికంగా పలువురు అభినందించారు.



## మల్చింగ్‌పై రైతులకు అవగాహన

నవతెలంగాణ-దహెగాం



మండల కేంద్రంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, కళాశాల పొలాస జగిత్యాల విద్యార్థులకు మల్చింగ్‌పై అవగాహన కల్పించారు. ఆదివారం వ్యవసాయ పనులు చేస్తున్న రైతుల పొలాల వద్దకు వెళ్లి మిర్చి పంటలో మల్చింగ్‌పై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మల్చింగ్ వల్ల నేలలతో తేమను, నీటిని సంరక్షించవచ్చని, పొలంలో కలుపు మొక్కలు రాకుండా నిరోధించవచ్చని పొలాస వ్యవసాయ కళాశాల విద్యార్థులు పి నరేష్, ఎం వినోద్, కె ఉదయ్ రైతులకు వివరించారు. కార్యక్రమంలో కె హేమంత్, మధు, ఏ శ్రావణ్, రైతులు రఘోత్తం రెడ్డి, యువ రైతు కార్తీక్ పాల్గొన్నారు.

## ఎన్నికల నిర్వహణకు కమిటీ ఏర్పాటు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



పట్టణ పద్మశాలీ సేవా సంఘం ఎన్నికల నిర్వహణకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసినట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు ఇరుకుల ఆంజనేయులు తెలిపారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణ సంఘం ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడంతో పాటు అందరిని ఒకే తాటిపైకి తీసుకువచ్చే ఉద్దేశంతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కమిటీకి చైర్మన్‌గా చెన్నూరు ప్రకాష్‌ను నియమించగా సభ్యులుగా తిరుపతయ్య, మధుకర్, రవీందర్‌లను ఎన్నిక చేశామని వీరి ఆధ్వర్యంలో ఎన్నికలు జరుగుతాయన్నారు. సంఘంలోని సభ్యులంతా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మల్లయ్య, గౌరవ అధ్యక్షుడు రాజయ్య, కోశాధికారి మురళి, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకన్న, సభ్యులు లింగయ్య, యేసయ్య, అంజన్న, ప్రసాద్, ధర్మయ్య, మధుసూదన్ పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలకు తర్వలోనే పరిష్కారం

- ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి





నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఉపాధ్యాయుల సమస్యలను త్వరలోనే పరిష్కరించనున్నట్లు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక పద్మశాలి భవన్‌లో పీఆర్‌టీయుటీఎస్ కుంరంభీం ఆసిఫాబాద్ జిల్లా సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. దీనికి స్థానిక ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా రఘోత్తంరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలన్నింటికి పరిష్కారం దొరుకుతుందని అన్నారు. పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను మంజూరు చేయించడం, మంచి ఫిట్‌మెంట్‌తో పీఆర్‌సీ ఇప్పించడం జరుగుతుందని అన్నారు. ఇటీవల నిర్వహించిన పదోన్నతులలో మిగిలిన ప్రధానోపాధ్యాయుల, స్కూల్ అసిస్టెంట్ పోస్టులను ప్రమోషన్ల ద్వారా భర్తీ చేసేందుకు ప్రభుత్వంతో చర్చించి కార్యాచరణ ప్రకటించనున్నట్లు తెలిపారు. మిగిలిన ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుల పోస్టులకు అర్హులైన బీఈడీ అర్హత కలిగిన ఎస్జీటీ ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇప్పించనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతుల కల్పనకు తన వంతు కృషిచేస్తానని అన్నారు. ప్రతీ పాఠశాలకు ప్రదాన గేటు నుండి భవనం వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి హామీ ఇచ్చారు. ఇటీవల పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులను సన్మానించారు.

**జిల్లా కమిటీ ఎన్నిక**

సమావేశం అనంతరం నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఏటుకూరి శ్రీనివాస్‌రావు, ప్రధాన కార్యదర్శిగా చునార్కర్ అనిల్‌కుమార్, అసోషియేట్ అధ్యక్షులుగా టి రాకేష్, ఇ భూమన్న, మహిళా అసోషియేట్ అధ్యక్షులుగా డి గంగాభవాని, ఉపాధ్యక్షులుగా ఎస్‌కె ఖాదర్ మొహినొద్దీన్, జి భరత్‌రావు, సిహెచ్ భరత్‌కుమార్, డి దామోదర్, ఆర్ రవి, మహిళా ఉపాధ్యక్షులుగా వై సమత, కార్యదర్శులుగా డి సంతోష్, దుర్గం భీమయ్య, సిహెచ్ పురుషోత్తం, టి సోనేరావు, మహిళా కార్యదర్శిగా డి సుజాతలను ఎన్నుకున్నారు.

## 26న ఎస్పీఎం కార్మికుల సమావేశం



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఈ నెల 26న సిర్పూరు పేపర్ మిల్లు కార్మికులతో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు సీఐటీయూ అనుబంధ సిర్పూరు పేపర్ మిల్ మజ్దూర్ యూనియన్ (రి.నెం. ఇ-2510) ప్రధాన కార్యదర్శి కూశన రాజన్న తెలిపారు. ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని ఒక ప్రైవేట్ లాడ్జింగ్‌లో నిర్వహించే ఈ సమావేశానికి సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లిఖార్జున్ హాజరు కానున్నట్లు తెలిపారు. త్వరలో ఎస్పీఎం గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మిల్లు పున:ప్రారంభమైన తర్వాత కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, యాజమాన్యం చిన్న చిన్న సమస్యలను కూడా పరిష్కరించకుండా అనేక ఇబ్బందులకు గురి చేస్తోందని అన్నారు. అనేక డిపార్ట్‌మెంట్‌లలో పర్మినెంట్ కార్మికులను తొలగించి, ఔట్‌సోర్సింగ్ విధానాన్ని తీసుకువస్తోందని అన్నారు. అనేక పరిశ్రమలలో సీఐటీయూ విజయం సాధించిందని, కార్మికుల పక్షాన పోరాడి చారిత్రాత్మక అగ్రిమెంట్లను చేసిన చరిత్ర సీఐటీయూకు ఉందని అన్నారు. ఈ నెల 11న తోషిబా అనే పెద్ద పరిశ్రమలో నాలుగో సారి గుర్తింపు సంఘంగా సీఐటీయూ విజయం సాధించిందని అన్నారు. ఎస్పీఎంలో కూడా సీఐటీయూను గెలిపిస్తే కార్మికులకు న్యాయం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్, నాయకులు కృష్ణమాచారి, అంగల శ్రీనివాస్, బూర సదయ్య, నీలి రాజన్న, గడమల్ల మహేష్, రాంశెట్టి రాజన్న, రమేష్ పాల్గొన్నారు.

## మూడో లైన్ కారణంగా పలు రైళ్ల రద్దు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

కాజీపేట వరంగల్ జంక్షన్ పరిధిలో రైల్వే మూడో లైన్ కారణంగా పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ఆసిఫాబాద్ రోడ్డు స్టేషన్ సూపరింటెండెంట్ శివకుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీనిలో భాగంగా సికింద్రాబాద్-కాగజ్‌నగర్ మధ్య నడిచే భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైలు నేటి నుండి వచ్చే నెల 8వ తేదీ వరకు రద్దు కానుందని, కాజీపేట-సిర్పూర్ మధ్య నడిచే రామగిరి ఈనెల 26 నుండి వచ్చే నెల 7వ తేదీ వరకు, భద్రాచలం నుండి బల్లర్ష నడిచే సింగరేణి ఈనెల 26 నుండి వచ్చే నెల 8వ తేదీ వరకు, హైదరాబాద్ నుండి కాగజ్‌నగర్ నడిచే ఇంటర్సిటీ ఎక్స్‌ప్రెస్ ఈనెల 28వ తేదీ నుండి వచ్చే నెల 8వ తేదీ వరకు రద్దు కానుందని తెలిపారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించి వారి ప్రయాణాన్ని సర్దుబాటు చేసుకోవాలని పేర్కొన్నారు.

# ఆన్‌లైన్ సేవలు పునరుద్ధరించాలి

- 15 రోజులుగా నిలిపివేత
- ఇబ్బందుల్లో ప్రజలు



ఆన్‌లైన్ కేంద్రానికి వచ్చిన జనాలు

నవతెలంగాణ-కెరమెరి

జైనూర్ ఘటన నేపథ్యంలో శాంతి భద్రతల కారణంగా ఆన్‌లైన్ సేవలను నిలిపివేశారు. 15 రోజులుగా ఆన్‌లైన్ సేవలు అందుబాటులో లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పహాని వన్ బీ, కులం, ఆధాయం, నివాసం ఆధార్ అప్ డేట్, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, మీ సేవ కేంద్రాల ద్వారా జారీ చేయబడతాయి. వీటి కోసం రెండు వారాలుగా మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు మీ సేవ కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఆన్‌లైన్ సేవలు లేక హైరానా చెందుతున్నారు. అనేక మంది రైతులు క్రాప్ లోన్ రినివల్ చేసుకోవడానికి తెలంగాణ గ్రామీణ బ్యాంకు వస్తున్నారు. రినివల్ చేసులోవాలంటే వన్ బి, పహాని తప్పనిసరి కావడంతో రైతులు మీ సేవా కేంద్రానికి బారులు తీరున్నారు. మీ సేవా కేంద్రంలో సిగ్నల్స్ లేక పోవడంతో వెనుతిరుగాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. రేషన్ బియ్యం సైతం బయోమెట్రిక్ ఉండడంతో ప్రత్యేక యాప్ ద్వారా రెండు రోజుల నుండి రేషన్ బియ్యం అందిస్తున్నారు. దీంతో సామాన్య నీరు పేద మధ్య తరగతి కుటుంబాల ప్రజలు ఊరట చెందారు. ప్రజల అవసరాల దృష్ట్యా, అత్యవసర సేవల నిమిత్తం ధ్రువీకరణ పత్రాల జారీ కోసం మీ సేవ కేంద్రాలకు ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి తేవాలని మండల ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

### రిజిస్ట్రేషన్‌కు సమయం లేదు

**డి.సత్యశీల, పరందొలి**



నేను నర్సింగ్ చదువుకున్నాను. మా గ్రామం నుండి మండల కేంద్రం సుమారు 21కిమి దూరంలో ఉంటుంది. నర్సింగ్ సర్టిఫికెట్స్ రిజిస్ట్రేషన్‌కు ఆదాయం ధ్రువీకరణ పత్రం అవసరముండి కెరమెరికి వచ్చాను. సిగ్నల్ లేవని మీ సేవా కేంద్రం నిర్వాహకుడు చెప్పారు. నాకు రిజిస్ట్రేషన్‌కు 25 చివరి రోజు ఉంది. ఆన్‌లైన్ సేవలు ఎప్పుడు అందుబాటులోకి వస్తాయోనని ఆందోళనగా ఉంది.

### మీ సేవ కేంద్రాలకు మినహాయింపు ఇవ్వాలి

**ఎస్‌కే. హారూన్, మీ సేవ నిర్వహకుడు, కెరమెరి**



15 రోజులుగా ఎలాంటి గిరాకీ లేదు. ఆన్‌లైన్ సేవలు నిలిపి వేయడంతో ఇబ్బందులు పడుతున్నాం. రోజు వారీ ఖర్చుల దృష్ట్యా కుటుంబ పోషణ భారంగా ఉంది. ఆన్‌లైన్ సేవలు మీ సేవ కేంద్రాలకు మినహాయింపు ఇవ్వాలి. ప్రజలకు కూడా సౌకర్యవంతంగా ఉంటుంది.

# జైలులో ముగిసిన అవగాహన సదస్సు




నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని ప్రత్యేక సబ్ జైలులో రెండు రోజులపాటు 'ధ్యానంతో సంతోషకరమైన ఆరోగ్యవంతమైన జీవితం' అనే అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సు ఆదివారం ముగిసింది. ముంపు కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవ అధికారిక సంస్థ కన్వీనర్, జిల్లా సీనియర్ సివిల్ జడ్జి యువరాజతో కలిసి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జిల్లా జడ్జీ ఏంవీ రమేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాత్కాలికంగా ఆనందాన్ని ఇచ్చే చెడు అలవాట్లు ప్రస్తుత పరిస్థితుల్లో నేరాలకు మూల కారణమవుతున్నాయని అన్నారు. నేరాలు జరగడంలో ముఖ్యమైన పాత్ర చెడు అలవాట్లు మద్యం, మాదకద్రవ్యాలు పోషిస్తున్నాయన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండి నేర ప్రవృత్తిని తగ్గించుకోవాలన్నారు. ప్రవర్తనలో మార్పు వచ్చి కేసు కొట్టి వేయించుకోవాలని ఆలోచన వచ్చినవారు, తెలిసో తెలియకో క్షణికావేశంలో తప్పులు చేసి జైలులో ఉన్నవారు న్యాయవాదిని నియమించుకునే స్తోమత లేనివారు న్యాయ సేవాధికార సంస్థ నుండి ఉచిత న్యాయ సహాయాన్ని పొందవచ్చని తెలిపారు. సొంత పూచికత్తు మీద బెయిల్ ఇచ్చే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఖైదీల ఆరోగ్య పరిస్థితులపై ప్రత్యేక దృష్టి సారించాలని, వైద్య సేవలందించాలని సూచించారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ ప్రేమ్ కుమార్, బ్రహ్మకుమారి రాణి, డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ అంజలీదేవి, జైలు అధికారులు పాల్గొన్నారు.



# ఘనంగా డీసీసీ అధ్యక్షుని పుట్టినరోజు వేడుకలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ జన్మదిన వేడుకలు జిల్లాలో ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఆయనతో కలిసి నాయకులు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుని సేవలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ మండల అధ్యక్షులు మసాదే చరణ్, పట్టణ అధ్యక్షులు ఎంఏ రఫిక్, కాంగ్రెస్ నాయకులు శేక్ కలీం, చునర్కర్ దీపక్ పాల్గొన్నారు.

**జిల్లా కేంద్రంలో..**

జిల్లా కేంద్రాల్లోని జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయం వద్ద వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బొమ్మెన బాలేశ్వర్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ గాదవేణి మల్లేష్, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు డా.రమేష్ రూపనార్, మాజీ ఆత్మ చైర్మన్ కె.రమేష్, సీనియర్ నాయకులు అబ్దుల్లా, అసద్, సెండె దత్తు, కలీమ్, మెకార్తి శ్రీనివాస్, అమన్, మరిశెట్టి కృష్ణమూర్తి, నిమ్మల మహేష్ గౌడ్, దాన పెల్లి శ్యామ్ రావ్, వైరగరే ప్రతాప్, సఫాన్, బోయిరె నానజీ, రాజన్న పాల్గొన్నారు.

# చారిగాంలో దేశీదారు పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మండలం చారిగాం గ్రామంలో ఆదివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దేశీదారు మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలో దేశీదారు మద్యాన్ని విక్రయిస్తున్నారని అందిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించారు. గ్రామంలో పాడుబడ్డ ఇళ్లను కేంద్రంగా చేసుకొని దేశీదారును కాగజ్‌నగర్ పట్టణం తీరందాజ్ బస్తీకి చెందిన డొంగ్రి మహేష్, మహారాష్ట్రలోని బల్లార్షాకు చెందిన రితిక్ రాజువాల్కే, సంతోష్ దేవాజీ మడావి చారిగాం గ్రామం నుండి ఇతర ప్రదేశాలకు దేశీదారు సరఫరా చేస్తున్నట్లు తేలింది. ఇందులో ఒకరు పరారీ కాగా మిగిలిన ఇద్దరి నుండి రూ. 55,500 విలువ కల 15 కార్టూన్ల దేశీదారును స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ తెలిపారు. స్వాధీనం చేసుకున్న మద్యాన్ని కాగజ్‌నగర్ రూరల్ పోలీసుస్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు. యువత చెడు వ్యసనాలకు లోను కావద్దని, దేశీదారు, గుడుంబా, గంజాయి లాంటి మత్తుపదార్థాలు అమ్మినా, తయారు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలపాలపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ దాడులలో సీఐ రాణాప్రతాప్‌తో పాటు ఎస్ఐ వెంకటేష్, సిబ్బంది మధు, రమేష్ పాల్గొన్నారు.

## 'దాడి చేసిన వారిపై ఎస్పీకి ఫిర్యాదు చేస్తా'

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఈ నెల 20న కాగజ్‌నగర్‌లోని ఎన్టీఆర్ చౌక్‌లో జరిగిన ఘటనపై సోమవారం జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయనున్నట్లు బాధితురాలు రీమా వేణుయాదవ్ తెలిపారు. ఆదివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తన వ్యక్తిగత వీడియోలను కొంతమంది వైరల్ చేస్తున్నారని గత నెల 18న కాగజ్‌నగర్ టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే పోలీసులు సరిగా స్పందించలేదని, కేవలం నామమాత్రంగా ఇద్దరిపై కేసు నమోదు చేసి వదిలేశారని ఆమె ఆరోపించింది. తానే కొంతమంది యువకుల వద్దకు వెళ్లి వారి సెల్‌ఫోన్‌లను పరిశీలిస్తే తన వీడియోలతో పాటు మరో ముగ్గురు అమ్మాయిల వీడియోలు కూడా ఉన్నాయని, ఈ విషయాన్ని పోలీసులకు తెలిపినా వారు స్పందించలేదని ఆరోపించింది. ఎన్టీఆర్‌చౌక్‌లోని ఒక మద్యం దుకాణంలో పని చేసే యువకుని సెల్‌ఫోన్‌లో వీడియో ఉన్నట్లు తెలువగా తాను వెళ్లి ప్రశ్నిస్తే తనను నలుగురు వ్యక్తులు కలిసి చితకబాదారని, ఇది పోలీసుల సమక్షంలోనే జరిగిందని వాపోయింది. అనంతరం తాను రోడ్డుపై కూర్చొని నిరసన తెలుపుతుండగా వెనుకనుండి కారు వచ్చి ఢీకొట్టడంతో తాను గాయపడ్డానని, సాక్షాత్తు టౌన్ సీఐ సమక్షంలోనే ఇది జరిగినా పోలీసులు ఇంతవరకు చర్యలు తీసుకోలేదని అన్నారు. ఒక మహిళను నడిరోడ్డుపై నానా బూతులు తిడుతూ, కాళ్లతో తన్నుతూ చితకబాదుతున్నా పోలీసులు ఎందుకు అడ్డుకోలేదని ప్రశ్నించారు. తనపై దాడి చేసిన నవీన్‌గౌడ్, వంశీ, శివ, భరత్‌లపై సోమవారం టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసి, అనంతరం జిల్లా ఎస్పీకి కూడా ఫిర్యాదు చేయనున్నట్లు ఆమె వివరించింది. కాగజ్‌నగర్‌లో గుండాయిజం నానాటికీ పెరుగుతోందని, దీనికి పోలీసుల వైఫల్యమే కారణమని ఆమె ఆరోపించింది.

## కొనసాగుతున్న బీజేపీ సభ్యత్వ నమోదు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

బీజేపీ సభ్యత నమోదు కార్యక్రమం మండలంలో కొనసాగుతుంది. మండలంలోని యాపల్‌పాటి గ్రామంలో మాజీ ఎంపీపీ మల్లికార్జున్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో అగ్రస్థానంలో భారత్ ఉండాలంటే మోడీతోనే సాధ్యమవుతుందన్నారు. ప్రస్తుతం ప్రపంచంలోని అన్ని దేశాలు భారత్ వైపు చూస్తున్నాయని తెలిపారు. సభ్యత్వ నమోదు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో గ్రామ పటేల్‌తో పాటు ప్రజలు పాల్గొన్నారు.

## విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలి

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదిగి దేశానికి మంచి పేరు తేవాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని పాత హౌజింగ్ బోర్డు సరస్వతి శిశుమందిర్‌లో విభాగ్ స్థాయి గణిత విజ్ఞాన్ మేళ నిర్వహించాగా ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విజ్ఞాన మేళలో యాక్టివ్‌గా పాల్గొన్న విద్యార్థులను ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం విజ్ఞాన మేళను ప్రారంభించి పలువురు విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల వైజ్ఞానిక ప్రదర్శనలను ఆసక్తిగా తిలకించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యారంగానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తుందని పాఠశాలల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్, నూతన జాతీయ విద్యా విధానం, బేటి బచావో బేటి పడావో, నేషనల్ మెరిట్ స్కాలర్షిప్ లాంటి పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. జిల్లాలో విద్యాభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సంజీవ్, పాఠశాల అధ్యక్షులు భజరంగ్, అగ్రికల్చర్ ప్రొఫెసర్ శ్రీధర్ చౌహన్ పాల్గొన్నారు.

## సనాతన హిందూ ఉత్సవ సమితి నూతన కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లా సనాతన హిందూ ఉత్సవ సమితి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఈ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమితి నూతన అధ్యక్షులుగా ప్రమోద్ కుమార్ ఖత్రి, ప్రధాన కార్యదర్శిగా గెడం మాధవ్, కోశాధికారిగా పడకంటి సూర్యకాంత్, కార్యనిర్వాహక కార్యదర్శిగా రేణిగుంట్ల రవీందర్, ఉపాధ్యక్షులుగా సామనపల్లి నర్సింలు, నర్సోజి మురార్కర్, కౌటికి రాజు, లోలపు శ్రీనివాస్, కృష్ణ గౌడ్, లక్ష్మీకాంత్ బరాడే, సంయుక్త కార్యదర్శులుగా కొత్తపల్లి సంజీవ్, బెదోడ్కర్ సంతోష్, మాదాస్తు సంతోష్, ఎన్నవార్ రాజు, గౌరువార్ సతీష్, పొట్టిపెల్లి విజయ్, సలహాదారులుగా మీసాల స్వామి, పూసం ఆనంద్‌రావు, గంగాధరయ్య మహిపాల్, బాలాజీ సింగ్ ఠాకూర్, వేముల ఆశన్న, ఆసూరి హనుమాండ్లు యాదవ్, అమరేందర్, కోరెడ్డి పార్థసారథి, గౌరవ సభ్యులుగా వెనగంటి ప్రకాష్, పాశం రాఘవేంద్ర, ఉరాడే సుభాష్, వెంకట్‌రెడ్డి, సతీష్ మిట్టల్, బాశెట్టి గజేందర్, వెంకటేష్, దశరథ్, జనగం దినకర్, సంతోష్ పుల్లెవార్, న్యాయ సలహాదారులుగా బిపిన్ కుమార్ పటేల్ ఎన్నికైన వారిలో ఉన్నారు.

4

# నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

# మంచిర్యాల

సోమవారం | సెప్టెంబర్ 23, 2024 | www.navatelangana.com

## మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పోలీసుల తనిఖీలు

నవతెలంగాణ-వేమనపల్లి



మావోయిస్టు పార్టీ 20వ సంస్థాపన ఉత్సవాల నేపథ్యంలో నీల్వాయి ఎస్ఐ శ్యామ్ పటేల్, టీఎస్ఎస్పీ సిబ్బందితో మంగలనపల్లి ఎక్స్ రోడ్డు వద్ద ఆదివారం వాహనాలను తనిఖీ చేశారు. వ్యక్తుల వివరాలు తెలుసుకుంటూ వారి వెంట ఉన్న వస్తువులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ నీల్వాయి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆకస్మిక తనిఖీలు, ఆర్ఓపి, ఏరియా డామినేషన్ నిర్వహించడం జరుగుతుందని, అదేవిధంగా మీ నివాస ప్రాంతాల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు అనుమానస్పదంగా కనిపించినట్లయితే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.

## చిలుకలయ్య ఆలయ నిర్మాణానికి విరాళం అందజేత

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని కవ్వాల్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న చిలుకలయ్య దేవాలయానికి రూ.5016 విరాళాన్ని తెలంగాణ నేతకాని మహార్ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయిని ప్రసాద్ నేత అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు అక్టోబర్ 4న ప్రారంభించబడుతున్న దేవాలయ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరుకావాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సర్వీసెస్ చారిటబుల్ ట్రస్ట్ సంస్థ సభ్యులు వొళ్ళాల నర్సగౌడ్, మంతెన వెంకటేష్, దుర్గం వినోద్, అల్లూరి వినోద్, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు రాజగౌడ్, తుడుం శివకృష్ణ, హనుమంతు, రాజుకుమార్, మల్లేష్‌గౌడ్ పాల్గొన్నారు.

## నేతకాని సంక్షేమ సంఘం కామన్‌పల్లి గ్రామ కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కామన్‌పల్లి నేతకాని మహార్ సంక్షేమ సంఘం నూతన గ్రామ కమిటీని సంఘ సభ్యులు ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు బోర్లకుంట వెంకటేష్ మాట్లాడుతూ గ్రామ కమిటీల ద్వారా మాత్రమే నేతకాని యువత సంఘటితమవుతుందని జాతి సమస్యలపై చైతన్యం జరుగుతుందన్నారు. ఈ చైతన్యం ద్వారానే నేతకాని సైనికుడు పుట్టుకొస్తారన్నారు. గ్రామంలో లేదా మండలంలో మనకంటూ ప్రత్యేక గుర్తింపు రావడమే కాకుండా నాయకులుగా గుర్తింపు పొందుతూ రాబోయే ఎన్నికల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలుగా వివిధ పదవులలో మన సామాజిక వర్గానికి గుర్తింపు పొందడం జరుగుతుందన్నారు. గ్రామ అధ్యక్షుడిగా బోర్లకుంట వెంకటేష్, ఉపాధ్యక్షుడిగా జునుగూరు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా జునుగూరు గణేష్, కార్యదర్శిగా కామెర పోశన్న, కోశాధికారిగా దుర్గం రాజన్న, గడ్డి జగన్, పలువురు సలహాదారులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## ఆర్యవైశ్య మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సాహితి

నవతెలంగాణ-లక్సెట్టిపేట



ఆర్యవైశ్య మహాసభ మహిళ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా పట్టణానికి చెందిన నరేందుల సాహితి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో వాసవి క్లబ్ సెక్రటరీగా పలు సామాజిక కార్యక్రమాలతో పాటు ఆర్యవైశ్య సంఘం కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. ఆమె చేసిన సేవలను గుర్తించి ఆర్యవైశ్య మహాసభ జిల్లా కమిటీలో తగిన ప్రాధాన్యత కల్పించినట్లు ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు కొత్త వెంకటేశ్వర్లు తెలిపారు.

**మహిళా అభివృద్ధికి కృషి**

ఆర్యవైశ్య మహిళల అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని ఆర్యవైశ్య మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన నరేందుల సాహితి పేర్కొన్నారు. తనపై నమ్మకంతో ఈ పదవిని కట్టబెట్టిన వారి నమ్మకాన్ని వమ్ము వమ్ము చేయకుండా ఆర్యవైశ్య మహాసభ కోసం తన శాయశక్తుల కృషి చేస్తానని అన్నారు. తన ఎన్నికకకు సహకరించిన ఆర్యవైశ్య నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## గల్ఫ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని తపాలపూర్ గ్రామ గల్ఫ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఆ గ్రామంలో రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా గల్ఫ్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర కార్యదర్శి మాటేటి కొమురయ్య మాట్లాడుతూ గల్ఫ్ కార్మికుల కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షనీయమన్నారు. గల్ఫ్‌లో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా, వారి పిల్లలకు గురుకుల పాఠశాలలో సీట్లు ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్మికులు ప్రభుత్వానికి రుణపడి ఉంటారన్నారు. అందుకు సహకరించిన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం తపాలపురం గ్రామ వెల్ఫేర్ సొసైటీ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## మానసిక స్థితి సరిగా లేక మహిళ ఆత్మహత్య

నవతెలంగాణ-వేమనపల్లి

మండలంలోని ముల్కలపేట గ్రామానికి చెందిన ఆకుల అంకు(40) ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు నీల్వాయి ఎస్ఐ శ్యామ్ పటేల్ తెలిపారు. వివరాలలోకి వెళ్తే మృతురాలు వికలాంగురాలు, నాలుగు రోజుల నుంచి మానసిక స్థితి సరిగా లేక పిచ్చిపిచ్చిగా ప్రవర్తిస్తూ, చనిపోయిన తన తల్లిని గుర్తు చేసుకుంటూ తిరుగుతుంది. శుక్రవారం ఉరేసుకోగా అక్కడ ఉన్న మృతురాలి తమ్ముడు అశోక్ గౌడ్ గమనించి ఉరి నుంచి తీసి కాపాడినారు. అదేవిధంగా ఆదివారం ఉదయం 8 గంటల సమయాన మృతురాలు తన ఇంట్లో మరోసారి దూలానికి చున్నీతో ఉరేసుకోగా మృతురాలి అన్న చూచి తలుపులు బలవంతంగా తెరిచి చూడగా అప్పటికే ప్రాణం పోయి ఉన్నది. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



# 15 నుంచి పీడీఎస్‌యూ అర్ధ శతాబ్ది ఉత్సవాలు



నవతెలంగాణ-మంచిర్యాల

పీడీఎస్‌యూ అర్ధ శతాబ్ది ఉత్సవాలను ఈ నెల 15 నుంచి అక్టోబర్ 23 వరకు నిర్వహించే ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి శ్రీకాంత్ పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎస్సీ గర్ల్స్ హాస్టల్‌లో అర్ధ శతాబ్ది ఉత్సవాలకు సంభందించిన పోస్టర్లను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 ఏళ్ల విప్లవ ప్రస్థానంలో అనేకమంది విద్యార్థి లు జెండా కోసం తమ ప్రాణాలు త్యాగం చేశారని గుర్తు చేశారు. జార్జి రెడ్డి మతోన్మాద కత్తిపోట్లకి ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో నేల కొరిగాడని తెలిపారు. జంపాల చంద్రశేఖర్, శ్రీపాద శ్రీహరి నాటి ఎమర్జెన్సీ చీకట్లో నాటి నియంతృత్వ పాలకుల తుపాకి తూటాలకు తమ ప్రాణాలను అర్పించారని, కోలా శంకర్, చేరాలు రంగవల్లి, స్నేహలత, మారోజు వీరన్న, మధుసూదన్, రాజు యాదవ్, యానాల వీరారెడ్డి, రమణయ్య, సాంబన్న లాంటి ఎందరో వీరులు తమ ప్రాణాలను త్యాగం చేసి ప్రగతిశీల విద్యార్థి ఉద్యమాన్ని నిలబెట్టారని అన్నారు. ఏ విద్యార్థి సంఘానికి లేని త్యాగాల చరిత్ర పీడీఎస్‌యూకు ఉందని తెలిపారు. ధ్వసం అవుతున్న ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవడానికి విద్యా కార్పొరేటికరణకి వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యావిదానాన్ని రద్దు చేసేందుకు నిరంతరం పోరాటం చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు లక్ష్మి, శివాని, మౌనిక, మేఘన, సువర్ణ పాల్గొన్నారు.

# లాభాల వాటపై శ్వేతపత్రం విడుదల చేయాలి

నవతెలంగాణ-నస్పూర్




సింగరేణి సంస్థ 2023-24 ఆర్థిక సంవత్సరానికి సాధించిన వాస్తవ లాభాలపైన శ్వేత పత్రం విడుదల చేయాలని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ (బీఎంఎస్) రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. ఆదివారం ఏరియా ఉపాధ్యక్షుడు నాతాడే శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన శ్రీరాంపూర్ ఏరియా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంస్థ సాధించిన రూ.37వేల కోట్లు అని సింగరేణి యాజమాన్యం ప్రకటించిందని, వాస్తవ లాభాలపైన 33 శాతం చెల్లిస్తామని 16.9 శాతం చెల్లించి వాస్తవ లాభాలను పంపిణీ చేయుటంలో వైఫల్యం చెందిన సింగరేణి యాజమాన్యం, గుర్తింపు, ప్రాతినిధ్య, సంఘాలు సింగరేణి కార్మికుల శ్రమను ఆర్థిక దోపిడీ చేయడం సరియైన విధానం కాదని తెలిపారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి రూ.32 వేల కోట్ల టర్నోవర్ వచ్చిన లాభాలు రూ. 2222 కోట్లు 32 శాతం రూ.711.04 కోట్లు పంపిణీ చేసిన యాజమాన్యం, అంకెల గారడితో కార్మికులను ఆర్థికంగా నష్టం చేయడం సరైన విధానం కాదన్నారు. నికర లాభాలు రూ.4701 కోట్లపైన 33 శాతం రూ.796 కోట్లు ఇస్తున్నామని అసత్య ప్రచారం చేయడం మానుకోవాలన్నారు. రూ.4701కోట్లు నికర లాభాలు 33 శాతం వాట రూ.1551.33 కోట్లు పంపిణీ చేసిన, రూ.3149.67 కోట్లు అందుబాటులో ఉంటాయని, రూ.2289 కోట్లు, తీసివేసినట్లు ప్రకటించకుండా, రూ.2412 కోట్ల 33 శాతం రూ.796 కోట్లు ఇస్తూ, రూ.4701 కోట్లకు, 33శాతం వాటా ఇస్తున్నామని తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ప్రభుత్వం, గుర్తింపు, ప్రాతినిధ్య కార్మిక సంఘాల వైఖరిని కార్మికులు గమనిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాగం రాజేందర్, పురుషోత్తం చారి, గూడ శ్రీకాంత్, మంద కమలాకర్, మేకల స్వామి, జెల్ల తిరుపతి, మోతె ఓదేలు, కాంపల్లి తిరుపతి పాల్గొన్నారు.

# కొనసాగుతున్న రుషి పంచమి వేడుకలు



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మథుర ప్రజల ఆరాధ్యదైవం అందుతాండలోని జ్వాలాముఖి, కాలుబాబా, పాచుబాబా ఆలయంలో ప్రతి యేటా ఇక్కడ రుషి పంచమి పండగను పీఠాధిపతి రామ్‌సింగ్ మహారాజ్ ఆధ్వర్యంలో కొనసాగుతుంది. రెండు రోజులు కొనసాగే ఈ వేడుకలకు జిల్లా నలుమూలల నుంచి గాక మహారాష్ట్రలోని నాందేడ్, సావర్గావ్, కిన్వట్,

- దారులన్నీ అందుతాండ వైపే

చంద్రపూర్, పూసద్, పక్క జిల్లా అయిన నిజామాబాద్ నుంచి ప్రజలు తండోపతండాలుగా అందుతాండకు తరలి వస్తున్నారు. ప్రతి ఒక్కరు వారి కుల గురువు కాలుబాబా, పాచుబాబాతో పాటు జ్వాలముఖి దేవతను దర్శించుకున్నారు. పీఠాధిపతి రాంసింగ్ మహారాజ్ ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు వారి వా యిద్యాలైన నగారా, వాయిస్తూ సాంప్రదాయ వేషధారణతో కోలాట నృత్యం చేశారు. ఈ నృత్యాన్ని పోటా పోటీగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వచ్చిన భక్తులకు సహపంక్తి భోజనాలు నిర్వహించారు. ఈ కార్యక్రమం రెండు రోజుల వరకు కొనసాగుతోంది. తొలి రోజు ప్రముఖులు మథుర సంఘం రాష్ట్ర నాయకులు థాన్‌సింగ్, రాయ్‌మల్ సేట్, వివిధ ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.

## అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూములు ఇవ్వాలి

- సిపిఐ(ఎం) డిమాండ్
- రుద్రూర్‌లో పార్టీ జెండా ఆవిష్కరణ.

నవతెలంగాణ-వర్ని

అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూములు ఇవ్వాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం రుద్రూర్ మండలంలో పార్టీ మహాసభల సందర్భంగా మండల కేంద్రంలో గ్రామ పార్టీ కార్యదర్శి లక్ష్మణ్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉమ్మడి మండల కార్యదర్శి నన్నేసాబ్ మాట్లాడుతూ.. పార్టీ ఇప్పటి వరకు చేపట్టిన ఉద్యమాలు, రాబోయే రోజు పార్టీ చేపట్టే కార్యాచరణపై సమీక్ష చర్చలు నిర్వహించారు. పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. మండలంలో ప్రభుత్వం నిర్మించిన రెండు పడుకల ఇండ్ల అసలైన అర్హులైన లబ్దిదారులకు, ఇండ్లు లేని పేదలకు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సాయిబాబా, బీమయ్య, గంగాధర్, గంగారాం, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్లపై కాలం చెల్లిన వాహనాలు

నవతెలంగాణ-బోధన్

కాలం చెల్లిన వాహనాలను నిషేధించాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చిన కొంతమంది యథేచ్ఛగా కాలం చెల్లిన పాత వాహనాలపై దర్జాగా తిరుగుతూ కాలుష్యానికి కారకులవుతున్నారు. 15 సంవత్సరాలకు పైబడిన వాహనాలను తప్పనిసరిగా నిషేదించాలని ప్రభుత్వం హెచ్చరించినా.. క్షేత్రస్థాయిలో నిబంధనలు అమలు కావడం లేదు. దాంతో పాత ద్విచక్ర వాహనాలు రోడ్లపై జోరుగా పొగ వదులుతూ వెళ్తున్నాయి. ఈ వాహనాల వలన ఇతర వాహన దారులు ఇబ్బందులు పడవలసి వస్తుంది. కావున సంబంధిత శాఖ అధికారులు తక్షణమే స్పందించి రోడ్లపై తిరిగే కాలం చెల్లిన వాహనాలపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

## విద్యుత్‌షాక్‌తో వానరం మృతి

నవతెలంగాణ-పోతంగల్

మండలంలోని కొడిచర్ల గ్రామశివారులో విద్యుత్ షాక్‌తో వానరం మృతిచెందింది. ఈ సందర్భంగా గ్రామస్తులు భక్తి, భజనలతో అంత్యక్రియలు చేసి మానవత్వం చాటుకున్నారు.

## ప్రమాదవశాత్తు కుంటలో పడి రైతు మృతి

నవతెలంగాణ-పిట్లం

ప్రమాదవశాత్తు కాలుజారి కుంటలో పడి రైతు మృతి చెందిన ఘటన మండలంలోని కారేగావ్ గ్రామంలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై రాజు కథనం మేరకు.. కారేగావ్ గ్రామానికి చెందిన బేగారి దశరథ్ (52) శనివారం ఉదయం 10 గంటల సమయంలో గ్రామ శివారులో గల చిన్న కుంట వద్దగల తన పొలానికి చిన్న కుంట నుండి నీళ్లు పారిస్తుండగా.. ప్రమాదవశాత్తు కాలుజారి కుంటలో పడి మరణించినట్లు తెలిపారు. మృతుడి భార్య లింగవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## కళాకారులకు సభ్యత్వం అందజేత

నవతెలంగాణ-కామారెడ్డి

పిల్లనగ్రోవి ఫ్లూట్ విద్వాంసుడు కిషన్, పద్యాల పఠణంలో విద్వాంసుడు ప్రభాకర్, కథలు రాస్తున్న ప్రముఖ కథకుడు పూర్ణచంద్రరావుకు సీనియర్ సిటిజన్ ఫోరంలో నిర్వహించిన పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో తెలంగాణ రచయితల వేదిక తెరవే జిల్లా అధ్యక్షుడు గఫూర్ శిక్షక్ ఆదివారం సభ్యత్వాన్ని వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరి సేవలు సమాజానికి ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు.

## తిరుమల ప్రసాద కల్తీపై పలువురు ఆగ్రహం

నవతెలంగాణ-కోటగిరి

తిరుమల తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదం తయారీలో పశువుల కొవ్వు, కల్తీ నూనెల వినియోగం జరిగినట్టుగా ల్యాబ్ రిపోర్టులు వచ్చినందున ఈ కల్తీకి కారణమైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని కఠినంగా శిక్షించాలని బీజేపీ మండలాధ్యక్షుడు ఏముల నవీన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గంగాధర్ దేశాయ్ డిమాండ్ చేశారు. హిందూ దేవాలయ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో కోటగిరి మండల కేంద్రంలో ఆదివారం జగన్మోహన్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి సభ్యులు, హౌగిరి రావు దేశాయ్, బిజెపి సీనియర్ నాయకులు పుల్లెల మోహన్‌రావు, కర్నే గజేందర్, భూమయ్య మామిడి రాయుడు, పత్తి సతీష్, ఎడ్డేడి హన్మాండ్లు, తెల్ల అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

## పల్లె నిద్రతో నేరాల నియంత్రణ



నవతెలంగాణ-వేమనపల్లి

పల్లెనిద్రతో నేరాను నియంత్రించవచ్చని నీల్వాయి ఎస్ఐ శ్యామ్ పటేల్ పేర్కొన్నారు. రామగుండం సీపీ శ్రీనివాసులు ఆదేశాల మేరకు నీల్వాయి పోలీసు స్టేషన్ పరిధిలోని కొత్తగూడెంలో పల్లె నిద్ర కార్యక్రమాన్ని శనివారం రాత్రి చేపట్టారు. గ్రామ ప్రజలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అసాంఘిక కార్యకలాపాలు, వివాదాలు, నేరాలు, స్థానిక ఉన్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. గంజాయి, అక్రమ మద్యం రవాణా, క్రయవిక్రయాలకు పాల్పడితే నూతన చట్టాల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాల గురించిన సమాచారం తెలిస్తే స్థానిక పోలీస్ అధికారులకు లేదా డయల్ 100, 112 నెంబర్లకు కాల్ చేసి సమాచారం అందించాలని సూచించారు.

## ఆరోపణలను ఖండిస్తున్నాం : ఏఐటీయూసీ

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) నాయకులు మైనింగ్ స్టాఫ్ నాయకులను బెదిరించారని కొన్ని కార్మిక సంఘాల నాయకులు ఆరోపించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీ సైదా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మా బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య గని మేనేజర్‌తో మాట్లాడుతున్న సందర్భంలో మైనింగ్ స్టాప్ సూపర్‌వైజర్ జోక్యం చేసుకోవడంతో వారి మధ్య వాగ్వాదం జరిగిందని, వెంటనే మా బ్రాంచ్ నాయకత్వం మైనింగ్ స్టాప్ నాయకులతో మాట్లాడి సమస్యను పరిష్కారం చేశామని పేర్కొన్నారు. నాయకులకు సూపర్‌వైజర్‌కు చిన్నచిన్న మనస్పార్థాలు రావడం సహజమేనని మనస్పర్థలు వచ్చిన అదే రోజు సమసి పోతాయని దాన్ని ఆసరాగా చేసుకొని కొన్ని కార్మిక సంఘాలు, నాయకులు సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం నాయకులపై అర్థరహితంగా ఆరోపణలు చేస్తే సహించబోమని అన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ



నవతెలంగాణ-వేమనపల్లి

మండలంలోని నీల్వాయి గ్రామంలో రూ.18,500 విలువ గల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఆదివారం మాజీ జడ్పీటీసీ రుద్రబట్ల సంతోష్ కుమార్, కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ సాబీర్ అలీతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షాన, ప్రజా పాలన చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గాలి మధు, తిరుపతిరెడ్డి, మధు సూదన్, రాజారాం, ఇగురం జగన్, రమేష్, తోకల రామచంద్రం, చెన్నూరి పురుషోత్తం, మంత్రి రమేష్ పాల్గొన్నారు.

## సభ్యత్వాలు ముమ్మరం చేయాలి

నవతెలంగాణ-ముథోల్

ఈనెల 25వరకు బూత్ స్థాయిలో సభ్యత్వాలు ముమ్మరంగా చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు అంజు కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశానికి హాజరై మాట్లాడారు. ఈనెల 25న పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి కార్యక్రమాన్ని పురస్కరించుకొని బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతి బూత్ స్థాయిలో 200 మంది ప్రజలకు బీజేపీ సభ్యత్వం తీసుకునేలా ప్రణాళికతో ముందుకెళ్లాలని అన్నారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులకు ఆయన సభ్యత్వ నమోదు కార్యక్రమంపై దిశానిర్దేశం చేశారు. ఈ నెల 25లోపు సభ్యత్వ నమోదు కార్యక్రమం ముగియనున్న నేపథ్యంలో భారీ సంఖ్యలో సభ్యత్వాలు చేయాలని కోరారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, సభ్యత్వ నమోదు చేయించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు పైడిపల్లి గంగాధర్, సామ రాజేశ్వర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నారాయణరెడ్డి, సభ్యత్వ నమోదు కన్వీనర్ శ్రీనివాస్, సోషల్ మీడియా అసెంబ్లీ కన్వీనర్ బుసి రవి, మండల అధ్యక్షులు కోరి పోతన్న, నాయకులు ఆర్.గంగాధర్, సుష్మితారెడ్డి, సతీష్‌రెడ్డి, ధర్మపురి సుదర్శన్, భూమేష్, రాజుల రఘునాథ్, పోతన్న, రమేష్, గంగాధర్, రాజు, రవి కుమార్, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## కిక్కిరిసిపోతున్న ఆన్‌లైన్ కేంద్రాలు



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

రాష్ట్ర ప్రభుత్వం రేషన్, ఆరోగ్య కార్డుల జారీకి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంలో పట్టణంలోని ఆన్‌లైన్ కేంద్రాలు దరఖాస్తు దారులతో కిక్కిరిసిపోతున్నాయి. ఆదివారం సైతం దరఖాస్తులు చేసుకునేందుకు పెద్ద సంఖ్యలో కేంద్రాలకు వస్తునున్నారు. పలు వార్డుల్లో స్థానిక నాయకులు ప్రత్యేక చొరవ తీసుకుని దరఖాస్తు చేసుకోవాలని ప్రోత్సహిస్తున్నారు. పట్టణంలోని 23వ వార్డు కౌన్సిలర్ పందిరి భూమన్న, వార్డు కమిటీ అధ్యక్షుడు స్వప్నిల్, ఇజ్జగిరి సంజయ్‌లు రేషన్ కార్డులు లేని వరిని గుర్తించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయిస్తున్నారు. అదేవిదంగా పలు వార్డుల్లోని ఆన్‌లైన్ కేంద్రాలు దరఖాస్తు దారులతో కిక్కిరిసిపోయాయి.